# చెల్లని రూపాయి




దివ్యప్రభాకర

డైలీ పేపర్లో లిస్టు చూస్తూనే మండి పడ్డాడు_ పరమేశం. తన పేరుగాని, తన భార్యామణి పేరుగాని లేదు. ఎవరి పేరో వుంది.

"ఎవడీ దగుల్బాజీ?" అన్నాడు పరమేశం.

"పిలిచారా?" అంది రేడియో వింటున్న అతని భార్యామణి నాగ్మణి.

"ఇట్రా!" అన్నాడు కోపంగా.

ఒచ్చింది.

"మన నియోజకవర్గానికి నిన్ను సెలక్ట్ చెయ్యలేదు. పోనీ నన్నయినా ఏడిశారా? అదీ లేదు. వీడి పేరెప్పుడైనా విన్నావా? బంగార్రాజుట!" అన్నాడు పరమేశం_ పేపర్ని నాగ్మణి ముఖానికి తాకించి.

"బంగార్రాజా?.... ఏమిటి మీరనేది?....అయితే చైర్మన్ పచ్చి మోసం చేశాడన్నమాట! పదండి హైద్రాబాదు." అంటూ చిదుల్తొక్కింది నాగ్మణి.

నాగ్మణంటే మాటలు కాదు_ సుప్రసిద్ధ ప్రజాసేవకురాలు! ముఖ్యంగా రెండేళ్ళనుంచీ ఆవిడ తిన్నచోట తినక, పడుకున్న చోట పడుకోక నియోజకవర్గమంతా తిరుగుతోంది.

గోమయాన్ని తీసుకుని భక్తితో కళ్ళకద్దుకుని నెత్తినెట్టుకునే దేశంలో పుట్టినా గోమయం కాలి కంటితే ముందస్తుగా కార్బాలిక్ సబ్బుతోను, అనంతరం శాండిల్ సోపుతోను కనీసం పదిసార్లు తోమితోమి, ఆనక ఓ పట్టెడు పౌడరు, సీసాడుసెంటు దిమ్మరించుకునే నాగ్మణి_ గత రెండేళ్ళుగా పట్నంనుంచి గ్రామాలకీ, పల్లెలకీ, గూడేలకీ చొచ్చుకుపోయి, రొచ్చులో_ కుక్కిమంచంలో_ కొడవలి తెగి, కుళ్ళిపోయి కంపు కొడుతున్న కాలితో మూలుగుతూ పడున్న హరిజనవాడలోని మునలయ్య కుక్కిమంచం తాలూకు వాసంబొంగుమీద కూర్చుని యోగక్షేమాలు కనుక్కుని, పొద్దుపోకే లోపల డాక్టర్ని సప్లయిచేసింది!

"ప్రజాసేవంటే ఇంతకంటే ఏముంది?" అని ఆ రాత్రి జరిగిన మీటింగులో నాగ్మణి, ఆమె అనుంగు భర్తా, వీరిద్దరి ముద్దుల అనుయాయులూ బల్లలు గుద్ది ప్రశ్నించారు_ ప్రజల్ని!

'ప్రజాసేవాతత్పర' అని అప్పటి కప్పుడే ఆమెకి బిరుదివ్వడానికి అభిమానులంతా ఆదరాబాదరా సిద్ధపడితే "బిరుదులూ, పదవులూ కాదు నాక్కావలసింది-కేవలం మీ అభిమానం మాత్రమే" అంటూ తన ప్రజాసేవాతత్పరతతో పాటు నిస్స్వార్థ బుద్ధికూడా ప్రదర్శించింది- శ్రీమతి నాగ్మణి.

ఆమె భర్త పరమేశం అదే సభలో మాట్లాడుతూ, "మా ఆవిడని చెప్పుకోడం కాదుగాని, ఆమెని 'ప్రజాసేవా తత్పర' అంటే సరిపోదు_ 'భూతసేవా తత్పర' అనాలి. ఇవ్వాళ హరిజనవాడలో ముసలయ్యని చూసి ఆమె హృదయం కరిగిందని మాత్రం మీకు తెలుసు కానీ, కాదుకాదు_ మీరు పూర్తిగా పొరపడ్డారు. 'భౌ' మని మొరగవలసిన పెంపుడు కుక్క 'కుయ్‌కుయ్' మన్నదంటే దానికేదో రోగమొచ్చిందని వెంటనే గుర్తించి ప్రాంతంలోని పశువుల డాక్టర్లందరికీ కార్లు పంపిస్తుంది. ఆ కుక్కబాధ తనదిగా తెల్లవార్లూ రోదిస్తుందని నేను తమకు సవినయంగా మనవి చేసుకుంటున్నా...." అని ఉద్ఘాటించాడు.

రెండేళ్ళు గడిచాయి, ఎన్నికలొచ్చాయి.

పార్టీల పెద్దల గోచీలు ఊడిపోతున్నాయి. సూపర్‌ఫాస్టు ట్రయిన్లూ విమానాలూ అభ్యర్థిత్వానికై టికెట్లు అర్థించేవారి బరువుతో వింపాదిగా నడుస్తున్నాయి.

నాగ్మణి, పరమేశం నాలుగు చిన్న కార్లలో బయలుదేరారు. అంటే వాళ్ళిద్దరే నాలుగు చిన్నకార్లలో వెళ్ళారని కాదు. వాళ్ళిద్దరూ ఓ కార్లోనే కూర్చున్నారు. మిగిలిన వాటిల్లో వియోజక వర్గానికి చెందిన ప్రెసిడెంట్లు, మాజీ ప్రెసిడెంట్లు లాంటి ఫిగర్స్ కూర్చున్నారు.

అయితే శవాన్ని దింపుడుకళ్ళం ఆశతో అక్కడక్కడా దింపుతూ తీసుకుపోయినట్టు కార్లన్నీ మధ్యమధ్య ఆగుతున్నాయి. అలా ఆగినప్పుడు నాగ్మణి తన కార్లోంచి దిగి మరో కార్లో ఎక్కి, దాంట్లోని ఫిగర్స్‌తో స్థానిక రాజకీయాలు గుండకొట్టిపోసి, ఏ పార్టీకి ఎన్ని కిలోల గుండ వస్తుందో వాళ్ళచేత తూకాలు వేయిస్తోంది.

ఎట్టకేలకు హైద్రాబాద్ చేరుకుని హైక్లాసు హోటల్లో దిగి ఆ రాత్రికి ఆరంభోత్సవం పేరిట పార్టీ చేసుకుని, తెల్లారుతూనే పార్టీపెద్దలమీద పడ్డారు.

"మీ ప్రజాసేవా చరిత్రనంతా రాసి ఇవ్వండి_రాజధానికి పంపిస్తాం" అన్నారు శ్రీవారు.

వెంటనే ఓ రాజకీయ వారపత్రిక సంపాదకుణ్ణి సంపాదించి, వాడికో బుద్ధి కొట్టించి, ఓ పచ్చ కాగితాన్ని నల్లగా నలిపి వాడి జేబులో కుక్కి తమ చరిత్ర

నంతా చెడామడా రాయించేశారు. అది ఆఫీసు ఫైల్లోకి వెళ్ళిపోయినా వీళ్ళు మాత్రం హైద్రాబాదు వదల్లేదు. శ్రీవారి చుట్టూ శ్రీకారాలు చుడుతూనే వున్నారు.

ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. మందు పార్టీలంటూ ప్రత్యేకంగా జరుపుకోడాని కెవరికీ తీరకలేదు. అందుకని మందు సీసాలు పెద్దల ముందున్న బల్లల మీది కొచ్చేసి తూలుతున్నాయి.

"పోనీ ఓసారి రాజధానికెళ్ళి రారాదూ?" అని శ్రీవారు నాగ్మణికి చెవులో ఉపదేశం చేశారు.

పొలోమంటూ బోలెడుమంది ఢిల్లీ వెళ్ళొచ్చారు.

అంటే ఊరికే ఢిల్లీదాకా వెళ్ళి తిరిగొచ్చారని కాదు. వంగి వంగి దణ్ణాలు, నంగి నంగి మాటలు, ముసిముసి నవ్వులు ముద్దుముద్దు పలుకులు గట్రా కానిచ్చి చిట్టచివరికి బోర్లాపడి, వెల్లకిలాపడి తిరిగొచ్చారు.

"వెళ్ళొచ్చాం" అని శ్రీవారికి సవినయంగా చిత్తగించారు.

అంతట శ్రీవారు 'నో డౌట్, డెఫినిట్, గన్‌షాట్!' అన్చెప్పి వెళ్ళి రమ్మన్నారు.

వీళ్ళేమో ఆమాటే అందుకుని "వెళ్ళొస్తాం" మన్నారు.

"మళ్ళీ రానక్కర్లేదు— మంచిరోజు చూసి నామినేషన్ పడెయ్యటమే నాగ్మణీ!" అన్నారు శ్రీవారు.

ఆ మాట వింటూనే వీళ్ళకంటె ముందే ఊళ్ళోకొచ్చిపడిన భక్తులు రైలుస్టేషన్లో వీళ్ళకి సుస్వాగతం బోర్డు కట్టారు. చప్పట్లు కొట్టారు. వీళ్ళచేత దండలు మోయించారు.

అలాగా విజయోత్సవమే జరిపారు.

ఇది అప్పటి మాట!

తీరా యిప్పుడు లిస్టు చూస్తే పేరు లేదు. ఇదేదైనా ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లాగా కంప్యూటర్ పొరపాటేమోనన్న డౌటు లేకపోలేదు. అయినా నాగ్మణికి మాత్రం తోలు ఒలిచి కారం రాచినట్టుంది. అందుకే అరగంటలో ప్రయాణానికి రెడీ అయిపోయింది.

పరమేశం ఎప్పుడూ సిద్ధమే - అత్తా కోడలంచు జరీ ఉత్తరీయంతో, బట్టతల మీద బోసితాతగారి కిరీటంతో!

కార్లో కూర్చున్నవాళ్ళ సంభాషణ కారంత జోరుగా సాగుతోంది.

"నా పరువు ప్రతిష్ఠలు గంగలో కలిపాడు" అన్నాడు పరమేశం.

ఎవడు? అని అడగక్కర్లేదు. శ్రీవారు!

"నా మానాభిమానాలు మంట గలిపాడు" అంది నాగ్మణి.

మళ్ళీ ఎవరని అడగాలా?

పరమేశం పళ్ళు కొరికాడు.

నాగ్మణి నాలికొర్కుకుంది.

"చెడామడా తిట్టిపారేస్తా" అన్నాడు పరమేశం.

"ఆ చెంపా ఈ చెంపా వాయిం చేస్తా" అంది నాగ్మణి.

పరమేశం గుడ్లురిమాడు.

నాగ్మణి గుటకలు మింగింది.

దార్లో కాఫీ తాగితే కోపం తగ్గిపోతుందని, కోపాన్ని రాజుకోనిచ్చి రాజధాని చేరారు. కారుని ఏకాయెకి కార్యాలయానికే పట్టించారు.

అంతా హడావుడి! చీమలు పెట్టిన పుట్టలు! ఎటుచూసినా ప్రజాసేవకులే! కాబోయే ప్రతినిధులు! అవబోయి అవలేకపోయిన అతిరధులు!! అవలేకపోయినందుకు అనేక రకాలుగా ఓంప్ర పెడుతున్న మహారధులు!!! చచ్చిబూడిదై సెదుల్లో కలిసిన పెద్దల తాలూకు వారసులు! సెంటర్లలో మొలిచిన శిలావిగ్రహాల శిష్యపరమాణువులు!

తపన! ఆందోళన! పొగలు, సెగలు

ప్రజాసేవకోసం ఆక్రందన

"ఉన్నారా!" అని అడిగారు పీళ్ళు.

"లేరు. హైకమాండు పిలిస్తే ఎగిరెళ్ళారు."

ఎవర్ని తిట్టాలి?

"మీదేమైంది? మీదేమైంది?" పరస్పరం ప్రశ్నలు.

"మాది మాదే!"

"మాది పోయింది "

"ఏదో కిటుకుంది "

"ఏదో కిటుకుంది "

సణుగుళ్ళు, గొణుగుళ్ళు!

నాగ్మణి, పరమేశం హోటల్లో దిగారు — ఉసూరుమంటూ. కసిగా, అక్కసు కక్కుకుంటూ అన్నం తిన్నారు. అన్నం తిని మళ్ళీ అక్కసు కక్కుకున్నారు.

"రానీ....రానీ...." అని రికరింగ్‌లో పడ్డారు.


ఆ సాయంత్రం ఆకాశంనుంచి ఊడి పడ్డారు— శ్రీవారు— తుపుక్కు తుపుక్కున చిరునవ్వులు ఉమ్మేసుకుంటూ!

ఖరారుగాళ్ళంతా కాళ్ళకి మొక్కారు. మిస్సయినవాళ్ళంతా కస్సుబుస్సుమంటూ అసింటా యిసింటా తారట్లాడారు.

నాయకులవారు సర్వసమవర్తి. అందర్నీ ఒకే లెక్కన చూస్తారు. ఒకే చూపు చూస్తారు. అందుకే ఆయన ఖరారుగాళ్ళకీ, మిస్సుగాళ్ళకీ ఒకే తీరులో నొసలూ, భుజాలూ, కండువా ఎగరేశారు. అందరి ముఖానా తుపుక్కున ఓ చిరునవ్వు ఉమిసి, మత్తుగా ప్లిమత్తు దగ్గరికి సాగిపోయారు

వారు కారెక్కగానే తోకల ఊపులు ఆగిపోయాయి. తెగి, కారం అంటుకున్న తోకలు చుర్రుచుర్రు మన్నాయి.

అందరూ హడావుడిగా ఎవరి వాహనాల దగ్గరికి వారు పరుగెత్తారు. కొందరు మ్యూజికల్ చేర్స్‌లో




ప్లేయర్సులా సీటుకోసం కార్ల చుట్టూ పరుగెత్తారు! మొత్తానికి అందరికీ గోచీలూ, కండువాలతో పాటు సిగ్గూ శరం జారిపోయాయి! యిక్కడ వీడ్కోలు యిచ్చారుగదా, మళ్ళీ ఆఫీసు దగ్గిర ఆహ్వానించాలి. అదీ అసలు సంగతి!

ఆ రాత్రి....

నాగ్మణి శ్రీవారికి హోటల్నుంచి ఫోన్ చేసింది.

"మిమ్మల్ని కలవాలి – ఎప్పుడు రమ్మంటారు ?" అంది.

"మాట్లాడాలి, అంటే సరిపోయేదానికి 'కలవాలి' అంటుంది – దీనికింకా కొవ్వు అణగలా!" అనుకున్నాడు పరమేశం. పోనీ పనన్నా అయితే కొవ్వు అణక్క- పోయినా ఫరవాలేదు. ఎందుకంటే అధికారానికి పోతే కొవ్వు ఎలాగూ కావాలి!

అప్పటికే అరబాటిల్ పట్టేసిన పరమేశం పెళ్ళాంవంక ఎర్రకళ్ళతో గుర్రుగా చూశాడు.

"అంతకంటేనా! అలాగే....అలాగే సార్!" అంటోంది ఫోన్లో నాగ్మణి.

"ఏవిటలాగే!.... ఇలాగే!.... ఇలా అయితే ఎలాగే ?" అన్నాడు పరమేశం పాట పాడుతున్నట్టు.

"అలాగే....ఉంటా సార్ ?" అంది నాగ్మణి ఫోను నోట్లో నోరెట్టి.

పరమేశం నోరు చప్పరించుకున్నాడు.

"ఏవిటా ఆత్రం ?" ఫోను పెట్టాక నాగ్మణి అంది.

"ఏవిటా సోది? ఇదుగో నీ పెగ్గు!" అంటూ గ్లాసు అందించాడు ఆమె పెదాలకి.

"అది కాదు_ మాట్లాడుతూంటే మధ్యలో 'అలాగే యిలాగే' అంటూ మీ వెక్కిరింతలేవిటంట? ఆయన సలే ఫోన్లోంచే పేగులు లెక్కెట్టేస్తాడు," అంది గ్లాసంతా ఒకేసారి గుటకేస్తూ.

"సైన్సింకా డెవలప్ కాలేదు గాని లేకపోతే ఫోన్లోంచే వాణ్ని పొడిచేసుం దును!" అన్నాడు పరమేశం ఆవేశంగా!

"ఒస్తున్నాడు _ పొడవండి," అంది మళ్ళీ గ్లాసులు నింపుతూ.

"వాహట్! ఇక్కడికే! ఆలిండియా ఫిగర్! ఆల్ ఆం.ప్ర. పార్టీ సర్వాధికారి ఆయనే! ఆఫ్టరాల్ 'అమ్మన్నదొడ్డి' నియోజకవర్గానికి పార్టీ టిక్కెట్టు తెచ్చు కోలేక తన పరువు ప్రతిష్ఠల్నీ, తన మానాభిమానాల్నీ పోగుట్టుకున్న పరమేశంగాణ్ని పలకరించడానికి_కాదు, కాదు _ పరామర్శించటానికి యిక్కడికి వస్తున్నాడా? ఆశ్చర్యం! రానీ రానీ.... ఆయన్నో పట్టు పట్టాలిగాని నువ్వు చకచకా గ్లాసుల్లో పోసెయ్!" అని అరుస్తున్నట్టన్నాడు పరమేశం.

"మాట్లాడకుండండి. ఆయన చెప్పే దేదో ముందుగా వినద్దూ! మీ తిట్లూ, నా దెప్పుళ్ళూ తర్వాత...." అంది నాగమణి నార్మల్ దాటుతూ.

"నేను తిట్టను ఉతుకుతా...యూడిం చేస్తా "

"ఆ తర్వాత ఆరేస్తారా?" అంది పకపకా, ఊగిపోతూ నవ్వుతూ నాగమణి.

"నవ్వవే, నవ్వు ఇక్కడ కాదు మన నియోజకవర్గంలో కెళ్ళి నాలుగు రోడ్ల మధ్య నిల్చుని, నాలుగు ఫిగర్లు ఉన్నచోట నవ్వవే!....నవ్వుతున్నావ్ సిగ్గులేక!" అని వెటకరించాడు పరమేశం.

"సర్లే కూచోండి....నాలుగు గ్లాసులు పడితే అసలు సంగతేదో ఆయనే చెపు తాడు. నవ్వాలో ఏడవాలో అప్పుడు తేల్చుకుందాం. ఆయన రాగానే అనవస రంగా ఎగిరిపడి నాచేత తిట్లు తినకండి" అంది నాగమణి.

"తిడతావా? తిట్టు....తిట్టవే! నన్ను తిట్టాల్సిందే! నీ చేత్తాగించి సరదాకి _ బతిమాలి _ తిట్టించుకోలా? ఇప్పుడు తాగి సీరియస్‌గానే తిట్టెయ్! మరి నాతో కలిసి వాణ్ని కూడా తిట్టు_నీకు దమ్ము ఉంటే! నువ్వే ప్రజాసేవకురాలివైతే... నాతోపాటు తిట్టాలి! తిడతావా? తిడ తావా?" అంటూ రెట్టిస్తున్నాడు పరమేశం.

అట్టి సమయంబున కవాటముపై ఢమరుక ధ్వనులవలె టకటక ధ్వనులు!

"ఇష్! ఆయనొచ్చారు...." అంది నాగమణి లేస్తూ.

"ఆయనొచ్చారా? ఆయన? మరి ఈయనెవరే, ఈయన" అంటూ తన గుండెలమీద కొట్టుకున్నాడు.

"నోరు మూస్తారా, లేదా?" అంది రహస్యంగా.

"గుప్‌చుప్!... స్వాగతం పలుకు... పలుకు అంటా పలుకు."

నాగ్మణి తలుపు తీసింది. తీస్తూనే వినయంగా వంగి దణ్ణంపెట్టింది.

శ్రీవారు చిరునవ్వులు తుపుకు తుపుక్కున ఉమ్మేసుకుంటూ గదిని పావనం చేశారు. చేస్తూనే "ఆ! అంతా బావున్నారా? మనవాళ్ళంతా కులాసా? ఆ! ఈయనా ఇక్కడే వున్నారే! నైస్ నైస్," అన్నారు.

"కూర్చోండి" అంది నాగ్మణి తలుపు వేసివస్తూ.

ముగ్గురూ కూర్చున్నారు.

"మేము తమర్ని కలిసి ముప్ఫయి రోజులయింది. రోజుకి రెండు చొప్పున ముప్ఫయి రెళ్ళు అరవై నమస్కారాలు శ్రీవారూ!" అన్నాడు పరమేశం వినయాన్ని తెచ్చిపెట్టుకుంటూ.

"మనవాడప్పుడే విమాన మెక్కేశాడే?" అన్నారు శ్రీవారు.

"విమానం ఎక్కాం, రైలెక్కాం, కారెక్కాం.... అఖరికి రెండెడ్ల బండి ఎక్కాం. ఇక మా నియోజకవర్గంలో గాడిదెక్కడవే తరవాయి....తమ దయ వల్ల ...." అంటూ పరమేశం సాష్టాంగం పడిన ఫోజుపెట్టాడు.

శ్రీవారు చిద్విలాసంగా నవ్వారు. నాగ్మణి తోడుకి నవ్వింది. నవ్వి, గ్లాసు నింపి ఆయన చేతికిచ్చింది.

"తెలుసుగా నా దోసు...." అన్నారు శ్రీవారు నొసలు ఎగరేసి నవ్వుతూ.

"తెలుస్తెలుస్తెలుస్తెలుసు" అంటూ చేతులుతిప్పుతూ డాన్సుచేశాడు పరమేశం.

గ్లాసు పూర్తిచేసి టేబిలుమీద పెడ్తూ శ్రీవారు అన్నారు. "మనవాడు నామీద చాలా కోపంగా ఉన్నాడే!"

"కోపమా? లేదులేదు. భక్తే! అప్పుడప్పుడు దేవుళ్ళని కూడా తిడుతూండటం మన సంప్రదాయం కదాండి! రామదాసు ఏమన్నాడు? 'ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవూ - రామచంద్రా!' అని తిట్టలేదూ?" అంటూ రాగయుక్తంగా పాడాడు పరమేశం.

మొగుడు ముక్కిమెయ్యా తాగినా సమయానికి తగినట్టు లౌక్యంగా శ్రీవారి గుండెల్లో గుద్దుతున్నందుకు నాగ్మణి సంబరపడింది.

మరోసారి మూడు గ్లాసులూ గాల్లో తేలి ముద్దెట్టుకున్నాయి - ఖంగున!

"జరిగిన సంగతి చెప్పనా?" అన్నారు శ్రీవారు— నాగ్మణి మాంగల్య ప్రాంతీయాభివృద్ధిని కౌతుకంగా, తమకంగా గమనిస్తూ.

"జరిగిన సంగతి - మా పరువు ప్రతిష్ఠల్ని, మానాభిమానాల్ని పణదోసి పార్టీ టిక్కెట్టు మీదనుంచి దాటుకుపోవడం! ఇక జరగవలసిన పని.... మేమిద్దరం మా ప్రజాసేవా కార్యక్రమాలకి మంగళం పాడుకుంటూ ముసుగేసుకు

బొక్కిచోడం " అంటూ పరమేశం పెళ్ళాం పయిటచెంగు లాగి నెత్తినేసుకున్నాడు.

"మిష్టర్ పరమేశం! నెక్స్టుటైమ్ బెటర్ లక్ అనుకోవాలిగాని అలా జావకారిపోతే ఎలాగయ్యా!" అని ఊరడించబోయారు శ్రీవారు.

"ధనమానాలని ధారపోసింది ఇప్పుడూనూ బెటర్ లక్ నెక్స్టుటైముకేనా? ఈ లోపల మా నియోజకవర్గంలో మా తలలు వాలినవి వాలినట్టే వుండిపోయి నెక్స్టుటైముకి పండేపోతాయి," అన్నాడు నిష్ఠూరంగా పరమేశం.

"నిజం సార్! మా బతుకులు బజారున పడ్డాయి. దానికి విరుగుడుగా ఈ టికెట్టేదో వస్తుందీ, గెలుస్తాం, దాంతో అన్నీ పరిసిబారిపోతాయ్ – అనుకున్నాం. కానీ .... మీరు .... మీరు" మత్తుతో, మత్తులో కోపంతో, కోపంలో ఒణుకుతో నాగ్మణి అంది. ఆమె మాంగల్యాలు ఒణుకుతున్నాయి.

"నేను?" అంటూ కొంచెం సీరియస్ గానే అడిగారు శ్రీవారు చూపులు మార్చుకుంటూ.

"మీరు....మీరు....మోసం చేశారు" అని చకచకా అనేసింది నాగ్మణి.

లేవదీసుకుపోయినవాడు అన్నీ దోచుకుని, నడినగరంలో వదిలేసిపోతే పాతివ్రత్యాన్ని బజారున పెట్టినట్టూ, ఆ తర్వాత కొంతకాలానికి వదిలేసిపోయిన వాడు నడిరోడ్డుమీద ఎదురయినట్టూ అనిపిస్తోంది నాగ్మణికి! చురుగ్గా, చులకనగా, వాడిగా, వేడిగా మళ్ళీమళ్ళీ అంది "మోసం చేశారు, మోసం చేశారు" అని!

శ్రీవారి ముఖం గంభీరంగా మారింది. మందు ముఖానికెక్కి అప్పటికే అది కందగడ్డలా వుంది. ఆపైన వినరాని మాట విన్నట్టు ఆ కందగడ్డ తుకతుక ఉడుకుతోంది. శిరోవేష్టనాన్ని తీసి దులిపి మళ్ళీ పెట్టుకుని, తీసి బల్లమీద పడేది, గ్లాసులో వున్నదాన్ని కాస్తా గొంతులో ఒంపేసుకుని "చాలా నిర్మొహమాటంగా మాట్లాడుతున్నావ్ నాగ్మణీ!" అన్నారు! ఆయన చూపుడువేలు నాగ్మణి ముఖానికి దగ్గరగా వొచ్చి బెదిరిస్తోంది.

"మా బాధని బట్టి...." అంది నాగ్మణి

"మా భంగపాటుని బట్టి కూడా...." అని పూర్తిచేశాడు పరమేశం.

"సరే అయితే....వినండి...." అని ఏదో కథ మొదలుబెట్టబోతున్నట్టు అని, ఆగి.... "మన సెలక్షన్ కమిటీ చైర్మన్ గారి వయస్సెంతా?" అనడిగాడు – అష్టావధానంలో అప్రస్తుత ప్రశ్నలా!

"వారు లేకుండానే వారి షష్టిపూర్తి చేశాంగా – మా వూళ్ళో...." అన్నాడు పరమేశం – 'వారు లేకుండానే వారి శవాన్ని దహనం చేశాంగా' అన్నట్టు!

"అవునా!.... నీ వయస్సెంత




నాగ్మణీ !" అన్నారు శ్రీవారు - మూడు ముడతల మీదున్న నాగ్మణి పొట్టవంక చూస్తూ.

"దాని వయస్సు అది చెప్పదు. చెప్పినా నిజం చెప్పదు. నిజం చెప్పుతా నన్నా నేను చెప్పనివ్వను. అందుకని దాని వయస్సు అడక్కండి. కానీ.... అది.... ఇరవయ్యేళ్ళ కూతురికి తల్లని మాత్రం చెప్పగల్ను...." అంటూ పక పకా నవ్వాడు పరమేశం.

నాగ్మణి అతన్ని మింగబోయింది. పరమేశం పెదాలు బిగించి, రెండు చేతుల్తో వాటిని మూసుకున్నాడు.

మిలిట్రీలోకి రిక్రూట్ చేసుకుంటు న్నట్టు ఇప్పుడీ వయస్సు కొలతలూ, ఒంటి తూకాలూ ఎందు కవసరమయ్యాయో నాగ్మణికి అర్థంకాలా ! నొసలు చిట్లించి శ్రీవారి చూపులకి అడ్డంగా కొంగు తెర వేసేసింది.

"చైర్మన్‌గారి వ్యవహారం, చేస్తూ మీకు తెలియవులా వుంది. ప్రజాసేవకు రాళ్ళ సేవలతో ఆయన ఒళ్ళు మొద్దుబారి పోయింది. మీ నియోజకవర్గాని కిప్పుడు టికెక్కట్టిచ్చాం చూడండి...."

"ఎవడు వాడు ? బంగార్రాజా ? ఎక్కడి వాడు ? వాడి ప్రజాసేవా చరిత్రేవిటి ?" అని ఎగిరాడు పరమేశం.

"ఎక్కడి వాడైతేనేం ? చరిత్ర ఏదైతేనేం ?.... ఇదుగో ఈ ఫోటో చూడండి...." అంటూ శ్రీవారు తమ లాల్చీజేబులోనుంచి ఓ ఫోటోతీసి బల్ల మీద పడేశారు.

చూస్తూనే పరిమేశం పరవశమై పోతూ "రంభా? అహా! ఎవరీ స్టారూ? ఏమా ఫిగరూ?" అన్నాడు.

నాగ్మణి అతన్ని మోచేత్తో ఒక్క పోటు పొడిచి "ఉన్నదాన్ని ఒదులుకోడానికి సిగ్గులేదు. లేనిదాన్ని ఆశించడానికి అంతకన్నా సిగ్గులేదు." అని కసిరి, ఫోటో వంక ఓసారి చూసి, ఈసుపడి, మళ్ళీ చూసి, గ్లాసులోని విషం తాగి, మరింత విషం కక్కుతూ "ఎవరీ పిల్లముండ?" అంది.

శ్రీవారు ఈసడింపుగా చూశారు. యాష్ట్రేలోని సిగరెట్టు పీకని చూసినట్టు చూశారు. రేపు రిటయిరయ్యే లంచగొండి వంక చూసినట్టు చూశారు.

"పిల్లముండా?? పిల్లముండా కాదు బాలరండా కాదు బంగార్రాజు రెండో యిల్లాలు! ఇరవయ్యేళ్ళ బంగారప్పిల్ల గుర్రం. ఇంతకీ నాగ్మణీ! నీకు సూటిగా చెప్పేదేవిటంటే " అంటూ తాపీగా వెనక్కి జార్లబడి "ఇది చైర్మన్‌గారి కేస్టు," అన్నాడు శ్రీవారు.

మిగలపండిన సీతాఫలాన్ని చేత్తో ఒత్తినట్టుంది - నాగ్మణి తల! పాములు ఉంగలు చుట్టుకుంటున్నట్టున్నాయి నాగ్మణి కడుపులో పేగులు!

పరమేశం పంచుకి బిగిసి ఎచ్చిన మనిషిలా వున్నాడు!



శ్రీవారు వాళ్ళ గొడవ పట్టించుకోలేదు. 'మీరు మోసం చేశారు' అని తన ముఖానే వాళ్ళన్నందుకు ఆ మాత్రం ఎదురుదెబ్బ చాలదనే అనుకుంటున్నారు.

సీసాలో వున్నదంతా గ్లాసులోకి వచ్చేసింది. శ్రీవారు గ్లాసుని దించకుండా దిగమింగి లేచి నిల్చున్నారు.

"మిష్టర్ అండ్ మిసెస్ పరమేశం! నెక్స్టైమ్ బెటర్ లక్! ఈ సారికి బంగార్రాజు తరఫున ప్రచారం చెయ్యండి ఎప్పుడే అస్త్రం ఒదలాలో తెలియాలయ్యా! అయినా ఇరవయ్యేళ్ళ కూతురుండగా " అంటూనే చరచరా నిష్క్రమించారు శ్రీవారు!

పరువుప్రతిష్ఠలూ, మానాభిమానాలూ ధనధనా పేలిపోతున్నాయా గదిలో!!!